ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



# సీఎం సభను విజయవంతం చేయాలి

## డీసీసీ అధ్యక్షుడు జాదవ్ నరేష్



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 6న ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలం పిప్పిరి గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే సభను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు జాదవ్ నరేష్ కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్‌లోని జిల్లా డీసీసీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభకు ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరవుతున్నారని తెలిపారు. సభా స్థల ఏర్పాట్లను ఇప్పటికే జిల్లా ప్రభుత్వ అధికారులతో కలిసి పరిశీలించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు భారీగా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎంపీ సోయం బాపూరావు, డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డి, డీసీసీ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి







**ఉద్యమ కెరటం, తిర్యాణి:** హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని తిర్యాణి మండలంలోని రొంపల్లి మార్కగూడలో గురువారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నైతం రాంచందర్ పాల్గొని శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమంతుని ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగలు సమాజంలో సోదరభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నైతం రాంచందర్‌కు తీర్థప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనాలు అందించారు. అనంతరం అక్కడ నిర్వహిస్తున్న క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుర్సేంగా దేవులక్ష్మి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంకం గౌరయ్య, కూన సురేష్, పెందొర్ దర్శు, మాజీ సర్పంచులు దిందర్ శవ్, ఆత్రం అన్నపూర్ణ, మాజీ ఎంపీపీ వేడ్మా కమల, యశ్వంతరావు, వల్క రామచందర్, కొర్వేత నాందేవ్, మాజీ సర్పంచ్ కోట్నాక గణపతి, మోతిరామ్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి అన్ని విధాల తోడ్పడతా




**ఉద్యమ కెరటం, తిర్యాణి:** మండలంలోని ఏదులపాడు గ్రామపంచాయతీ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని సర్పంచ్ మడావి పార్వతి అంబారావు అన్నారు. ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు. గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని దశల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి వినోద్, కార్యదర్శి అశోక్, బీట్ ఆఫీసర్ మనోహర్, ఉప సర్పంచ్ మమత, వార్డ్ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండలం అచ్చులాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో బోగారం లక్ష్మికి మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి గురువారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గట్టు మురళీధర్ రావు ఆధ్వర్యంలో సర్పంచ్ మారిశెట్టి స్రవంతి శ్రీనివాస్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేదలకు సొంత ఇంటి కల సాకారం అవుతోందని తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎంపీఓ అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి కల్పన, జీపీవో స్వామి, మాజీ జెడ్పిటిసి బండి పోషం, వార్డు సభ్యులు దాగం పాపయ్య, అక్కపెల్లి రజిత, దాగం పోచయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు వరిమడ్ల తిరుపతి, పైలి అంకన్న, గువ్వల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బియ్యం.. ప్రైవేటు మిల్లుల పాలు?

- **అధికారుల కళ్లు గప్పి సాగుతున్న దందా..!**







**ఉద్యమ కెరటం, కాగజ్ నగర్:** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సరిహద్దు మండలమైన సిర్పూర్ (టీ)లో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. నిరుపేదలకు అందాల్సిన రేషన్ బియ్యం యథేచ్ఛగా పక్కదారి పడుతుండటం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఎన్ఫోర్స్మెంట్ జరిపిన దాడుల్లో వెలుగుచూసిన అంశాలు ఈ అక్రమ నెట్‌వర్క్ ఎంత బలంగా ఉందో స్పష్టం చేస్తున్నాయి. ఇది నిఘా లోపమా లేక అధికారుల కళ్లు గప్పి అక్రమార్కులు చేస్తున్న తెగింపా అన్న సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. బుధవారం రాత్రి సిర్పూర్ టీ ప్రాంతంలోని ఓ రైస్ మిల్లుపై పోలీసులు అకస్మాత్తుగా దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో ఎవరూ ఊహించని విధంగా సుమారు 7 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడటం కలకలం రేపింది. ప్రభుత్వ పథకాల ద్వారా పేదలకు అందాల్సిన ఈ బియ్యం రైస్ మిల్లు గోడౌన్లలో అక్రమంగా నిల్వ ఉండటం వెనుక పెద్ద ఎత్తున దందా సాగుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లబ్ధిదారుల నుండి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని సేకరించి, తిరిగి వాటిని బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు విక్రయించే ముఠా ఈ ప్రాంతంలో తిష్టవేసినట్లు తెలుస్తోంది.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** అణగారిన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని గురువారం ఆదిలాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్ పాల్గొని పాపన్న గౌడ్ విగ్రహం, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 18వ శతాబ్దంలోనే నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన మహా సామాజిక విప్లవకారుడని కొనియాడారు. సామాజిక సమానత్వం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నాయకుడిగా ఆయనను గుర్తు చేశారు. పాపన్న గౌడ్ కేవలం ఒక వర్గానికే పరిమితమైన నాయకుడు కాదని, అన్నివర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన సాగించిన ఆయన ఆదర్శాలు నేటి తరానికి మార్గదర్శకమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సర్దార్ పాపన్న గౌడ్ ఆశయాలకు అనుగుణంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తూ యువతకు ఆయన చరిత్రను పరిచయం చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, బీసీ అభివృద్ధి అధికారి దరావత్ సోనియా, జిల్లా అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మండల వ్యాప్తంగా గ్రామ సభలు





- **సంక్షేమ పథకాల అమలు, గ్రామ అభివృద్ధిపై తీర్మానాలు**

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక'కార్యక్రమంలో భాగంగా గురువారం నేరడిగొండ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచుల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. గ్రామాల్లో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలపై చర్చించడంతో పాటు గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం, గ్రామ అభివృద్ధి కార్యక్రమాలపై పలు తీర్మాణాలు చేశారు. ఈ సందర్భంగా నేరడిగొండ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించగా, వడూర్ గ్రామంలో సర్పంచ్ ఆడెపు శ్రీకాంత్, లఖంపూర్ గ్రామ పంచాయతీలో సర్పంచ్ సేడ్మకి సుజాత గంగాధర్, బుద్దికొండలో సర్పంచ్ ఏలేటి మహేందర్ రెడ్డి, వాంకిడి గ్రామంలో సర్పంచ్ జ్యోతి భోజన్న, గుత్పాలలో సర్పంచ్ పెందుర్ లక్ష్మిబాయి భీంరావ్, కుమారిలో సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లస్మన్న, సావర్గంలో సర్పంచ్ జాదవ్ కళ్యాణి మహేందర్, రోల్ మామడలో సర్పంచ్ తొడసం శంకర్, యాపల్ గూడలో సర్పంచ్ మండాడి కృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ సభలు తెలంగాణ జాతీయ గీతంతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని సర్పంచులు కోరారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో గ్రామ ప్రత్యేక అధికారులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సత్తుపల్లి మున్సిపాలిటీలో ఏసీబీ దాడులు

- **భారీ అవకతవకలు బట్టబయలు**




**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి మున్సిపాలిటీలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పలు అనుమానాస్పద అంశాలను బయటపెట్టారు. మార్చి 31న ఖమ్మం రేంజ్‌కు చెందిన ఏసీబీ అధికారులు మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో సడెన్ చెక్ నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా కార్యాలయ రికార్డులు, ఆర్థిక లావాదేవీలు, పన్నుల వసూళ్లు, పెండింగ్ దరఖాస్తులు, పరిపాలన విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పలు ఆర్థిక అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. మొత్తం వసూలు చేయాల్సిన రూ.16,44,15,000లో రూ.13,08,15,000 మాత్రమే వసూలై, రూ.3,36,00,000 బకాయి ఉన్నట్లు గుర్తించారు. ప్రాపర్టీ ట్యాక్స్‌లో మొత్తం రూ.5,12,68,000 వసూలు చేయాల్సి ఉండగా, రూ.1,02,83,000 మాత్రమే వసూలై రూ.4,09,85,000 బకాయి ఉన్నట్లు వెల్లడైంది. షాపింగ్ కాంప్లెక్స్ పన్ను రూ.62,61,525లో రూ.8,72,870 మాత్రమే వసూలై రూ.53,38,655 బకాయి ఉంది. అడ్వర్టైజ్‌మెంట్ ట్యాక్స్ రూ.3,80,679 పూర్తిగా వసూలైనట్లు అధికారులు తెలిపారు. మొత్తం వసూలు చేయాల్సిన రూ.22,23,25,204లో రూ.14,23,51,549 మాత్రమే వసూలై రూ.7,99,23,655 బకాయి ఉన్నట్లు గుర్తించారు. తనిఖీల సమయంలో సిబ్బంది మొబైల్ ఫోన్లను పరిశీలించగా అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలు బయటపడ్డాయి. ముఖ్యంగా బిల్ కలెక్టర్ నాగుబండి నరసింహారావు మొబైల్‌లో మేనేజర్ ఎం.శ్రీనివాస్‌తో పాటు మరికొందరితో జరిగిన అనుమానాస్పద ట్రాన్సాక్షన్లు గుర్తించారు. అలాగే రికార్డుల నిర్వహణలో లోపాలు, పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వంటి అంశాలు కూడా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ కొనసాగుతుందని, బాధ్యులపై చర్యల కోసం ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించనున్నట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు వెంటనే ఏసీబీని సంప్రదించాలని సూచించారు. టోల్ ఫ్రీ నం. 1064, వాట్సాప్ నం. 9440446106కు సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఫిర్యాదు దారుల వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని ఏసీబీ అధికారులు వివరించారు.

# గ్రామ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తా

**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** గ్రామ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని గుడిహత్నూర్ సర్పంచ్ ఆడెశీల అన్నారు. గురువారం గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొని గ్రామ అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. గ్రామంలోని సమస్యలపై పలు సూచనలు, సలహాలు అందించిన స్పెషల్ ఆఫీసర్ సునీత, ఎంపీఓ దిలీప్, పోలీస్ అధికారి శ్రీకాంత్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రూప, ఐకేపీ అధికారులు సుజాత, విద్యుత్ శాఖ ఏఈ గౌతమ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా కొత్త బోర్లు వేయడం జరిగిందన్నారు. ప్రతి కాలనీలో పైప్‌లైన్‌ల మరమ్మత్తులు చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికే వందల సంఖ్యలో లీకేజీలను తొలగించి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. గ్రామంలో పలు సీసీ రోడ్ల నిర్మాణ పనులు




పూర్తి చేశామని, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అదేవిధంగా నూతన వీవో భవనం, నూతన లైబ్రరీ, రైతుల కోసం నూతన గిడ్డంగి నిర్మాణ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. సర్పంచ్‌గా ఎన్నిక కాకముందు నుంచే గ్రామ అభివృద్ధి కోసం పనిచేస్తున్నానని, ఇంకా గ్రామానికి చేయాల్సిన అభివృద్ధి పనులు చాలా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత విద్యుత్, సన్నబియ్యం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఇందిరమ్మ ఇండ్లు, కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్, ఆరోగ్య శ్రీ పెంపు 10 లక్షలు, రైతు భరోసా, రుణమాఫీ వంటి పథకాల గురించి గ్రామ ప్రజలకు వివరించారు. ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటూ గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. త్వరలో ప్రభుత్వం చేపట్టే నూతన పెన్షన్లు ప్రారంభమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రెండో విడత ఇండ్ల పథకం ప్రారంభిస్తే మరింత మందికి లబ్ధి చేకూరుతుందని అన్నారు. గ్రామ శ్రేయస్సు కోసం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నిఖిల్, పంచాయతీ కార్యదర్శి రామదాస్, అమీన్ కారోబారీ, బీఎలో అధికారి అశోక్ లాంబడే, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే వార్డు సభలు

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ప్రజా సమస్యల పరిష్కారం కోసమే వార్డు సభలు నిర్వహించడం జరుగుతుందని సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "ప్రజాపాలన – ప్రగతి పాలన"99 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 10, 11 వార్డుల్లో వార్డు సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వార్డుల్లో ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులను స్వయంగా పరిశీలించారు. తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలపై ప్రజలు వెల్లడించిన సమస్యలను శ్రద్ధగా



విని సంబంధిత అధికారులకు తక్షణ పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రభుత్వం ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకునే విధానాన్ని అవలంభిస్తోందని తెలిపారు. వార్డు సభల ద్వారా ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహ, మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, పలు శాఖల అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాదె చెన్నారావు, ఇతర నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# మతసామరస్యానికి నిలువెత్తు నిదర్శనం

- **హనుమాన్ స్వాములకు పండ్లు, మజ్జిగ పంపిణీ చేసిన ముస్లిం సోదరులు**

**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట మండల కేంద్రంలో మతసామరస్యానికి నిదర్శనంగా నిలిచే ఘటన చోటుచేసుకుంది. హనుమాన్ మాల ధరించిన స్వాములకు స్థానిక ముస్లిం సోదరులు భక్తి భావంతో గురువారం పండ్లు, మజ్జిగ పంపిణీ చేసి సోదరభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ముస్లిం యువకులు కలిసి స్వాములకు సేవలు అందించారు. ఉపవాస దీక్షలో ఉన్న స్వాములకు పండ్లతో పాటు చల్లని మజ్జిగ అందజేసి వారి అలసటను తగ్గించే ప్రయత్నం చేశారు. కార్యక్రమం స్నేహపూర్వక



వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ "మతం వేరైనా.. మనసు ఒక్కటే"అనే భావనను ఇలాంటి సేవా కార్యక్రమాలు బలపరుస్తాయని పేర్కొన్నారు. గంభీరావుపేటలో ఎన్నో సంవత్సరాలుగా హిందూ–ముస్లిం సోదరభావం కొనసాగుతుండటం గర్వకారణమని తెలిపారు. హనుమాన్ మాల స్వాములు ముస్లిం సోదరుల సేవా భావాన్ని ప్రశంసిస్తూ తమకు ఇచ్చిన ఆతిథ్యం మరచిపోలేనిదని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగాలని గ్రామస్తులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, మహమ్మద్ ఆమెర్, అర్మాన్, అహ్మద్, అజీమ్, అదీబ్, జావెద్, సుఫియాన్, ముదసిర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం

**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని ఎంపీడీఓ బండారు ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం బెజ్జూర్ మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో ప్రజాపాలన– ప్రగతి నివేదిక గ్రామసభలు నిర్వహించినట్లు తెలిపారు. బెజ్జూర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ దుర్గం సరోజ తిరుపతి అధ్యక్షతన జరిగిన గ్రామసభకు తహశీల్దార్ రామ్మోహన్ రావు ప్రత్యేక అధికారిగా హాజరయ్యారు. కార్యక్రమం తెలంగాణ జాతీయ గీతాలాపనతో ప్రారంభమైంది. అనంతరం పంచాయతీ కార్యదర్శి మీసరి వైకుంఠం ముఖ్యమంత్రి సందేశంతో కూడిన ప్రజాపాలన ప్రగతి నివేదికను చదివి వినిపించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొని గత రెండు సంవత్సరాల మూడు నెలల కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను గ్రామ ప్రజలకు వివరించారు. అలాగే



ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన పలువురు తమ అనుభవాలను సభలో పంచుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో సమస్యలు ఉన్నాయని, గతంలో ఉచితంగా లభించిన ఇసుకను ప్రస్తుతం కొనుగోలు చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. గృహజ్యోతి పథకం అందరికీ వర్తించడం లేదని, ఉచిత గ్యాస్ కనెక్షన్ కూడా కొంత మందికి అందడం లేదని అన్నారు. రైతుబంధు సకాలంలో చెల్లించడం లేదని, రుణమాఫీ పూర్తిగా అమలు కాలేదని, రైతు భీమా, కళ్యాణలక్ష్మి వంటి పథకాల అమలుపై కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ప్రశ్నలకు స్పందించిన పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ 99 రోజుల ప్రజాపాలన అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమం కొనసాగుతుందని, ప్రజలు తమ సమస్యలను లిఖితపూర్వకంగా గ్రామసభ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హులను గుర్తించి సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాచకొండ ఆదర్శ్, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సరండి గ్రామసభలో ఉపాధ్యాయుల తీరుపై దుమారం

- **ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులపై ప్రజల ఆగ్రహం**

**ఉద్యమ కెరటం, వాంకిడి:** మండలంలోని సరండి గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం నిర్వహించిన గ్రామసభ ఉద్రిక్త వాతావరణంలో సాగింది. గ్రామ అభివృద్ధి, విద్యా వ్యవస్థ, సంక్షేమ పథకాలు, గృహాల కేటాయింపులు వంటి అంశాలపై గ్రామస్తులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల పనితీరుపై తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధాన ఉపాధ్యాయుడు ఆనంద్ రాజ్‌తో పాటు మరో ఉపాధ్యాయురాలు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తరచూ గైర్హాజరవుతున్నారని పేర్కొన్నారు. పిల్లలకు సరైన బోధన అందడం లేదని, కొన్నిసార్లు విద్యార్థులను మధ్యలోనే ఇంటికి



పంపిస్తున్నారని విమర్శించారు. "మా పిల్లల భవిష్యత్తు ఏమవుతుంది..?" అంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఈ ఆరోపణలను ఉపాధ్యాయులు ఖండించారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల విషయంలో కూడా గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మొదటి జాబితాలో అవకతవకలు జరిగాయని, నిజమైన పేదలను పక్కనపెట్టి ఆస్తులు ఉన్నవారికి ఇళ్లు కేటాయించారని ఆరోపించారు. గుడిసెల్లో నివసిస్తున్న పేదలకు ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ మొహర్లే బాపూజీ మాట్లాడుతూ ఉపాధ్యాయుల తీరుపై ఇప్పటికే ఎంఈఓకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సమస్యలపై అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామసభలో కొంతసేపు రాజకీయ చర్చలు కూడా జరిగాయి. ఈ సందర్భంగా వార్డు సభ్యురాలు రమాదేవి పార్టీ రాజకీయాలను పక్కనబెట్టి గ్రామ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామసభలో వెలుగులోకి వచ్చిన సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

# ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

## అదనపు కలెక్టర్ చంద్రయ్య



**ఉద్యమ కెరటం, తాండూర్:** గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య కోరారు. ప్రజాపాలన– ప్రగతి నివేదిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం తాండూర్ గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన గ్రామసభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి దొండా దివాకర్ గ్రామపంచాయతీ పరిధిలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల వివరాలు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులు, రైతు భరోసా, రైతు బీమా తదితర ప్రభుత్వ పథకాల వివరాలను గ్రామసభలో చదివి వినిపించారు. అనంతరం అదనపు కలెక్టర్ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన బిల్లులు ఎంతవరకు వచ్చాయో తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేస్తే పూర్తి బిల్లును ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తుందని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం పట్ల పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు తాగునీటి కొరత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మండలంలోని ఇతర గ్రామపంచాయతీలలో కూడా సర్పంచులు, పంచాయతీ ప్రత్యేక అధికారుల సమక్షంలో గ్రామసభలు నిర్వహించబడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎంపీడీఓ పి.శ్రీనివాస్, సర్పంచ్ ముడిమడుగుల సురేష్, ఉప సర్పంచ్ కుమ్మరి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ తాండూర్ మండల అధ్యక్షుడు ఎండి ఈసా, మాజీ జెడ్పిటిసి ఎస్.బానయ్య, మాజీ ఎంపీటీసీ ఎస్.శంకర్, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


# 700 సంవత్సరాలుగా వెలుగుతున్న అఖండ జ్యోతికి అరుదైన గుర్తింపు

- **గంభీరావుపేట శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయానికి ఘనత**



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రాచీన శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం మరోసారి ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంది. చాళుక్యుల కాలం నుంచి సుమారు 700 సంవత్సరాలుగా నిరంతరాయంగా వెలుగుతున్న అఖండ జ్యోతి (నందా దీపం)కు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంలో అరుదైన ఈ అఖండ జ్యోతి నిజాం కాలం నుంచి నేటి వరకు ఎప్పుడూ ఆరిపోకుండా వెలుగుతూ ఉండటం విశేషంగా నిలిచింది. గ్రామ ప్రజల అచంచల భక్తి, సంప్రదాయాల పట్ల గౌరవం, సమిష్టి సేవాభావం ఈ జ్యోతి నిరంతర కొనసాగింపుకు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. ప్రతిరోజూ గ్రామస్తులు ఇంధనం సమకూర్చి ఈ పవిత్ర జ్యోతిని కొనసాగించడం ఒక అపూర్వ ఆధ్యాత్మిక సేవగా గుర్తించబడింది. ఈ జ్యోతి గ్రామానికి ఐశ్వర్యం, సుభిక్షం, ధాన్య సమృద్ధి కలుగజేస్తుందని భక్తులు విశ్వసిస్తున్నారు. ఈ సందర్భంగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ చింతపట్ల వెంకటాచారి, డాక్టర్ టివి. అశోక్ కుమార్ తిరునగరి చేతుల మీదుగా ఆలయ ప్రతినిధులకు ప్రత్యేక గుర్తింపు సర్టిఫికేట్‌ను ప్రదానం చేశారు. ఈ గుర్తింపు గంభీరావుపేట గ్రామ ఆధ్యాత్మిక వైభవాన్ని రాష్ట్ర వ్యాప్తంగా మరింత వెలుగులోకి తీసుకువస్తుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# తాగునీరు పంపిణీ



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** ఆసిఫాబాద్ పట్టణంలోని కేస్లాపూర్ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద హనుమాన్ జయంతి సందర్భంగా ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆలయానికి వచ్చే భక్తులకు, స్వాములకు చల్లని తాగునీరు పంపిణీ చేసి తమ ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఉబెథ్ బిన్ యహియా (తారిక్) మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా మానవత్వంతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇమ్రాన్ హష్మి, ముబాషీర్, మెహెరాజ్, ఫైసల్ తదితరులు పాల్గొన్నారు.

# పారాక్వాట్ గడ్డి మందుపై ప్రభుత్వం నిషేధం




**ఉద్యమ కెరటం, తాండూర్:** తెలంగాణ రాష్ట్రంలో అత్యంత ప్రమాదకరమైన గడ్డి మందుగా గుర్తించిన పారాక్వాట్ వినియోగాన్ని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తాండూర్ మండల వ్యవసాయ అధికారి కె.సుష్మ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ పారాక్వాట్ మందును పిచికారీ చేయడం ద్వారా మనుషుల శరీర అవయవాలపై అలాగే పశుసంపదపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పారాక్వాట్ మందుపై నిషేధం విధిస్తూ ఉత్తర్వు నెం.24 జారీ చేసిందని తెలిపారు. నేటి నుంచి 60 రోజుల పాటు పారాక్వాట్ గడ్డి మందు అమ్మకాలు, నిల్వలు, వినియోగంపై పూర్తిగా ఆంక్షలు విధించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించినట్లు పేర్కొన్నారు. మండలంలోని రైతులు ఈ విషయాన్ని గమనించి పారాక్వాట్ మందు వినియోగాన్ని నిలిపివేయాలని సూచించారు.

# సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



**ఉద్యమ కెరటం,బోథ్:** బోథ్ నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ గురువారం పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రూ.10లక్షల 5వేల విలువైన చెక్కులను 19 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం పెద్ద ఊరటనిస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతిఒక్కరూ ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. అవసరమైన సహాయం కోసం ఎప్పుడైనా తనను సంప్రదించవచ్చని, ప్రజల సేవే తన ధ్యేయమని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం తమ ప్రధాన లక్ష్యమని, భవిష్యత్తులో కూడా ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పల్లె ప్రకృతి వనం స్థలంలో భవనం నిర్మాణం

## గ్రామస్తుల ఆందోళన



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** కౌటాల మండలం బోధంపల్లి గ్రామంలో పల్లె ప్రకృతి వనం స్థలంలో ఐకేపీ (డ్వాక్రా) భవనం నిర్మాణం చేపడుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. గురువారం పల్లె ప్రకృతి వనం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో పచ్చదనం పెంపొందించడానికి, పర్యావరణ పరిరక్షణ కోసం పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్, గ్రామ కార్యదర్శులు గ్రామసభ నిర్వహించి పల్లె ప్రకృతి వనాన్ని కొనసాగిస్తామని ప్రజలకు తెలిపినప్పటికీ, ఆ తర్వాత అదే స్థలంలో ఐకేపీ భవనం నిర్మాణం చేపట్టడం సరైనది కాదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ఈ నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు. పల్లె ప్రకృతి వనం స్థలాన్ని మార్చడానికి ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయా..?, గ్రామసభ అనుమతి లేకుండా ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం చట్టబద్ధమేనా..? అని గ్రామస్తులు ప్రశ్నించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన వనాలను ఇలా తొలగించడం సరైంది కాదని మండిపడ్డారు. అధికారులు వెంటనే స్పందించి ఈ నిర్మాణాన్ని నిలిపివేసి పల్లె ప్రకృతి వనాన్ని యథాతథంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రెడ్డి శంకర్, గ్రామ యువ నాయకులు రామ్టెంకి నవీన్, తలపెల్లి మహేందర్, రామ్టెంకి ప్రభాకర్, చారి ఈశ్వర్, ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం



**ఉద్యమ కెరటం, వేంసూర్:** అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామని గ్రామ సర్పంచ్ సాధు లక్ష్మి అన్నారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, తాగునీటి సమస్య పరిష్కారం, రహదారుల నిర్మాణం, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామసభలో ప్రజలు తమ సమస్యలను వెల్లడించగా, అధికారులు వాటిని నమోదు చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాల గంగాధర రెడ్డి, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పుచ్చకాయల సోమిరెడ్డి, జంగా శ్రీనివాస రెడ్డి, పాల వెంకట రెడ్డి, పగుట్ల వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి వేణు, రెవెన్యూ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, ఆశా వర్కర్లు, డ్వాక్రా మహిళలు, గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# అందరికీ అండగా ప్రజా ప్రభుత్వం

- త్వరలో ఇందిరమ్మ భీమా పథకం
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్





**ఉద్యమ కెరటం, వేములవాడ:** ప్రజా ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు అండగా నిలుస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా వ్యాప్తంగా గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించారు. ఇందులో భాగంగా వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామంలో గ్రామసభ, వేములవాడ పట్టణంలోని 25వ వార్డులో వార్డు సభలు నిర్వహించగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించి రాష్ట్ర గీతం ఆలపించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు. చెక్కపల్లి గ్రామం, వేములవాడ పట్టణంలోని 25వ వార్డులో అమలవుతున్న ఆరు గ్యారంటీలు, వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న వారి వివరాలను సభలో వెల్లడించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాల ద్వారా తమకు ఎంతో మేలు జరుగుతోందని తెలిపారు. ఈ పథకాలతో ఆదా అవుతున్న డబ్బును పిల్లల ఉన్నత చదువులకు,





పొదుపుకు వినియోగి స్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో కోటి 15 లక్షల రేషన్ కార్డు లబ్ధిదారులకు త్వరలో రూ.5లక్షల జీవిత బీమా కల్పించను న్నామని తెలిపారు. రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేసినట్లు చెప్పారు. రేషన్ కార్డు జారీ నిరంతర ప్రక్రియ అని, ఎప్పుడైనా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్న వడ్లకు బోనస్ వంటి పథకాలతో రైతులకు మేలు జరుగుతోందని చెప్పారు. అర్హులైన ప్రతిఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. వేములవాడ పట్టణ అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి వేగంగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. అనంతరం కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో రాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 1303 ఇండ్లు పూర్తయ్యాయని తెలిపారు. రైతు రుణమాఫీ కింద 46,492 మంది రైతులకు రూ.370 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే 21,829 కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు చెప్పారు. అనంతరం చెక్కపల్లి గ్రామంలో వంగ హారికకు నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై లబ్ధిదారుకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, ఆర్డీఓ రాధాభాయ్, డీఎస్పీ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి షర్ఫుద్దీన్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, చెక్కపల్లి సర్పంచ్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం





- కలెక్టర్ కె.హరిత

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ప్రజాపాలన ద్వారానే గ్రామాల అభివృద్ధి సాధ్యమని జిల్లా కలెక్ట ర్ కె.హరిత అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం సిర్పూర్–టి మండలం మేడిపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ అదనపు సంచాలకులు నరసింహ, ఈఈ ధర్మేంద్రలు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని అధికారుల ద్వారా చదివి వినిపించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పెండింగ్ సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, అర్హులైన వారికి రేషన్ కార్డులు జారీ చేసి చౌకధరల దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెలలో మూడు నెలల రేషన్ బియ్యం అందించే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి రైతు భరోసా కింద ఎకరానికి సంవత్సరానికి రూ.12 వేల సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం అమలు, మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్మీడియట్ వరకు విస్తరించే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల సమర్థవంతమైన అమలుకు ప్రజల భాగస్వామ్యం అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



# మహిళా సంక్షేమం దిశగా సఖీ కేంద్రం సేవలు





- జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఉద్యమ కెరటం, వాంకిడి:** మహిళల సంక్షేమం దిశగా సఖీ కేంద్రం ద్వారా విశిష్ట సేవలు అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో ఉన్న సఖీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి మహిళలకు అందిస్తున్న సేవలు, సదుపాయాలు, నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ఉన్న మహిళలకు సురక్షిత వాతావరణం కల్పిస్తూ వారి సమస్యలకు తక్షణ పరిష్కారం అందించేందుకు సఖీ కేంద్రం పనిచేస్తుందని తెలిపారు. బాధిత మహిళలకు కౌన్సెలింగ్, న్యాయ సహాయం, వైద్య సేవలు, తాత్కాలిక ఆశ్రయం వంటి సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్రంలో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించి నమోదైన కేసుల వివరాలు, వాటి ప్రస్తుత స్థితిని తెలుసుకున్నారు. ప్రతి కేసులో సమయానుకూలంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కేంద్రంలో శుభ్రత, భద్రత, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. మహిళలపై జరుగుతున్న దాడులు, వేధింపులను అరికట్టడంలో సఖీ కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. మహిళలు నిర్భయంగా ముందుకొచ్చి తమ సమస్యలను తెలియజేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి కేసును సున్నితంగా పరిష్కరించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని, మహిళల గోప్యతను కాపాడుతూ సేవలు అందించాలని సూచించారు.

# ప్రజాపాలన వార్డు సభలు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ పట్టణంలోని 40వ వార్డు దస్నాపూర్, ధోబికాలనీలలో కౌన్సిలర్ చరణ్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం వార్డు సభలు నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజల సమస్యలను అధికారులతో కలిసి తెలుసుకుని లిఖితపూర్వకంగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ చరణ్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు మూడు నెలలు పూర్తయ్యాయని తెలిపారు. ఈ కాలంలో ప్రభుత్వం రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రుణమాఫీ, మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఆరోగ్య బీమా, గ్యాస్ సబ్సిడీ, సన్నబియ్యం, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంపు వంటి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. అదేవిధంగా పట్టణ అభివృద్ధికి రూ.158 కోట్లతో పలు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనుష సతీష్, అధికారులతో సమన్వయం చేసుకుంటూ వార్డు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. వార్డు సమస్యలను అధికారులతో కలిసి పరిష్కరించేందుకు కృషి చేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండలంలోని పలు గ్రామాల్లో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు హనుమాన్ ఆలయాలను శుభ్రపర్చి గంగాస్నానం చేసి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. బెజ్జూర్ మండల కేంద్రంలోని శ్రీ రంగనాయక స్వామి ఆలయ సముదాయంలో హనుమాన్ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. మధ్యాహ్నం 12 గంటలకు గ్రామంలోని పిల్లలు, యువకులు, మహిళలు పాల్గొని బాజాభజంత్రీలు, డీజే చప్పుళ్లతో గ్రామ పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. కాషాయ జెండాలు పట్టుకుని "జై శ్రీరామ్".. "జై బోలో హనుమాన్"అంటూ నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం రంగనాయక స్వామి ఆలయ ప్రాంగణంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు తంగడపల్లి మహేష్, కమిటీ సభ్యులు మరియు గ్రామ పెద్దలు సమన్వయంతో నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై సర్తాజ్ పాషా ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగుదాం

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** మహనీయుల ఆశయాలు, స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి ముందుకు సాగాలని జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్ రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగ, గౌడ కుల సంఘ నాయకులతో కలిసి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అనేక కులాలను ఏకం చేసి వీరోచితంగా పోరాడిన మహనీయుడని తెలిపారు. అరాచక పాలనకు వ్యతిరేకంగా పోరాడి సమాజానికి మార్గదర్శకుడిగా నిలిచారని అన్నారు. ఇలాంటి మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియజేసి వారి ఆశయ సాధనకు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. సంఘ నాయకులు ప్రస్తావించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రతినిధి సుగుణ, నియోజకవర్గ ఇంచార్జ్ శ్యామ్ నాయక్, గౌడ కుల సంఘ నాయకులు కొండ జగ్గా గౌడ్, మార్క శంకర్ గౌడ్, తాళ్ల శ్రీనివాస్ గౌడ్, చిరంజీవి గౌడ్, నీరజ గౌడ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బహుజన విప్లవ వీరుడు సర్దార్ పాపన్న గౌడ్

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ అన్నారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొఘల్ సామ్రాజ్యాన్ని గెరిల్లా పోరాటాలతో ఎదుర్కొని బహుజన జెండా ఎగరేసిన గొప్ప వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. అణగారిన వర్గాల ఆత్మగౌరవ పోరాటాలకు ప్రతీకగా నిలిచి సమాజానికి నిరంతర స్ఫూర్తిగా నిలిచారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, మాజీ టీపీసీసీ జనరల్ సెక్రటరీ గండ్ర సుజాత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి, మాజీ డీసీసీ సాజిద్ ఖాన్, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బ్రిజు లాల్, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీలు బండి దేవదాస్ చారి, మల్యాల కరుణాకర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పరమేశ్వర్, దినేష్ గౌడ్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# గ్రామాభివృద్ధే లక్ష్యంగా ముందుకు



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** గ్రామాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామని సర్పంచ్ ఫరాన అభిబ్ ఖాన్, ఉప సర్పంచ్ మొతేవార్ గణపత్ రావులు అన్నారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా గుడిహత్నూర్ మండలం లింగాపూర్ గ్రామంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న పలు సమస్యలను గ్రామస్తుల ద్వారా తెలుసుకున్నారు. ముఖ్యంగా వితంతువులు, వృద్ధుల పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, సీసీ రోడ్లు, తాగునీటి సమస్యలు వంటి అంశాలను గ్రామస్తులు ప్రస్తావించారు. పలు సమస్యలపై ఎంపీఓ దిలీప్ సానుకూలంగా స్పందిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సర్పంచ్, ఉప సర్పంచ్ మాట్లాడుతూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికి చేరేలా చర్యలు తీసుకుంటామని, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, త్వరలో పెన్షన్లు, విద్యా–వైద్య సేవలు, ప్రతి ఇంటికి తాగునీటి సౌకర్యం కల్పించే దిశగా చర్యలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రగతి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న ఫోన్లు బాధితులకు అప్పగింత




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితులకు రెబ్బెన పోలీసులు తిరిగి అందజేశారు. రెబ్బెన పోలీస్ స్టేషన్ పరిధిలోని గోలేటి గ్రామానికి చెందిన బోగే ఉపేందర్, దొమ్మటి ప్రవీణ్, వాంకిడి మండలానికి చెందిన శంకర్ తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి ఫోన్లను గుర్తించి గురువారం బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా, దొంగతనానికి గురైనా వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేస్తే ఫోన్‌ను తిరిగి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే ఎవరికైనా మొబైల్ ఫోన్లు, ఇతర విలువైన వస్తువులు దొరికితే సమీప పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని సూచించారు.

# ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** ప్రతిఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని గుడిహత్నూర్ ఎస్సై శ్రీకాంత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. బైక్‌పై ఇద్దరు ప్రయాణిస్తే ఇద్దరూ హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపడం ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ఇటీవల చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాలను ప్రస్తావిస్తూ ప్రజలు జాగ్రత్తగా ప్రయాణిస్తే ప్రమాదాలను తగ్గించవచ్చని అన్నారు. అలాగే గంజాయి సాగు, విక్రయాలు, రోడ్లపై బెల్ట్ షాపులు నిర్వహించడం వంటి అక్రమ కార్యకలాపాలను ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. గ్రామంలో ఏదైనా సమస్యలపై తీర్మానం చేసి తమకు అందిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ ఆడే శీల తెలిపారు.

# అధికారులు గైర్హాజరు సిర్పూర్ గ్రామసభ రద్దు

## ఉప సర్పంచ్ దుర్గం ప్రశాంత్



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** సిర్పూర్ గ్రామంలో నిర్వహించాల్సిన గ్రామసభకు సంబంధిత అధికారులు హాజరు కాకపోవడంతో సభను రద్దు చేసినట్లు ఉప సర్పంచ్ దుర్గం ప్రశాంత్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామస్థులు తమ సమస్యలను తెలియజేయడానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యారని చెప్పారు. అయితే గ్రామసభకు రావాల్సిన అధికారులు హాజరుకాకపోవడంతో సమావేశాన్ని నిర్వహించడం సాధ్యపడలేదని తెలిపారు. గ్రామానికి వచ్చిన ప్రజలకు "ఈరోజు గ్రామసభ రద్దు చేయబడింది"అని తెలియజేసినట్లు చెప్పారు. గ్రామానికి మొత్తం 29 శాఖలకు చెందిన అధికారులు రావాల్సి ఉండగా, కేవలం 5 శాఖల అధికారులు మాత్రమే హాజరైనట్లు వివరించారు. అధికారులు గైర్హాజరు కావడంతో గ్రామ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో గ్రామసభలను సమయానికి, పూర్తి స్థాయిలో నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

# ప్రజా పాలనతోనే గ్రామ అభివృద్ధి సాధ్యం



**ఉద్యమ కెరటం, వాంకిడి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం వాంకిడి మండలం గోయగాం గ్రామపంచాయతీలో గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గత రెండున్నర సంవత్సరాల కాలంలో ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అధికారులు వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై గ్రామసభలో తీర్మానాలు చేశారు. గ్రామస్థులు తమ సమస్యలను సభలో ప్రస్తావించి పరిష్కారం కోరుతూ దరఖాస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వివిధ శాఖల అధికారులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

